క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్యం

గద్వాల క్రైం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్య సిబ్బంది రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో వైద్య సిబ్బంది పర్యటించారు. ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెత్త చెదారం చెత్త వాహనాలల్లో వేయాలని సూచించారు. కాలనీలో పలువురు మలేరియా, టైపాయిడ్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఇంటింటి సర్వే చేపట్టి ఆరోగ్య అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది వరలక్ష్మి, మల్లికార్జున, ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



మల్దకల్: మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నాణ్యతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉదయం, సాయంత్రం నీళ్లు పోయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు యాకోబు, పంచాయతీ ఈఓ మాబీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపించొద్దు



అలంపూర్ రూరల్: మండలంలోని కాశపూర్ పాఠశాలలో జరుగుతున్న మన ఊరు– మన బడి పనులను బుధవారం ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు నిర్వహించి, అలంకరించారు. అనంతరం శ్రీశైలం పాదయాత్ర చేస్తున్న భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ, పండ్లు పంపిణీ



ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు శివారులో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు పండ్లు, మజ్జిగ, ఉచితంగా అందజేశారు. బుధవారం గ్రామానికి చెందిన శ్రీరామ్ రెడ్డి పండ్లు, విజేత బుక్‌షాప్ యజమాని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వినోద్, ఆంజనేయులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు తైబజారు వేలం పాట

రాజోళి: మండల కేంద్రంలో తైబజారు వేలం పాటను గురువారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెంకటేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్, కసబ్‌ఖానాకు వేలంపాట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తైబజారు వేలానికి రూ.30 వేలు, కసబ్‌ఖానా వేలానికి రూ.10 వేలు డిపాజిట్ చేయాలని కోరారు.

భక్తులకు అన్నదానం



అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురంలో కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న భక్తులకు బీఆర్‌ఎస్ నాయకులు నరసింహారెడ్డి ఐదు రోజుల నుంచి అన్నదానం చేస్తున్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఏఈ గోపాల్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ టౌన్ ప్రెసిడెంట్ ఎండీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- అధ్వానంగా మురుగు కాలువలు
- పట్టించుకోని అధికారులు



చెన్నిపాడులో మురుగుకాలువలో నిల్వ ఉన్న మురుగునీరు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో మురుగు కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. గ్రామాల్లో మురుగు కాలువల్లో పూడిక నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాలువల్లో మట్టి నిండి మురుగు నిలిచిపోయి, మురుగునీరు నిలువ ఉండటంతో దోమల బెడద పెరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ గ్రామాల్లో డ్రైయినేజీలు లేక రోడ్లపై మురుగు పారుతోంది. ప్రతియోటా నామమాత్రంగా పూడికతీత తీస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మురుగు కాలువలు మట్టితో, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. పందులు స్వైరవిహారం చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు బెడదతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో పందులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాలువలు శుభ్రం చేయాలి



మురుగుకాలువలను ప్రతి రోజు శుభ్రం చేయాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. కాలనీలో పందులు సంచరించకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. వైరల్ ఫీవర్‌తో చిన్నారులు, పెద్దలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాలువ చుట్టూ మురుగు పేరుకుపోయింది. అధికారులకు, పాలకులు పట్టించుకోవడం లేదు.

– రవికుమార్ చెన్నిపాడు గ్రామస్తుడు

సమస్య పరిష్కరిస్తాం

మండలంలోని మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తాం. నిత్యం శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. మురుగరు కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు చర్యలు చేపడతాం. రోడ్లపై మురుగుపారకుండా చూస్తాం.

– రమణరావు ఎంపీడీఓ రమణరావు మానవపాడు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



అయిజలో హరిహర కళాశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



మానవపాడు కళాశాలలో హాల్ టికెట్ నంబర్ చూస్తున్న విద్యార్థులు

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం పరీక్షలు సజావుగా సాగాయి. 342 మంది విద్యార్థులకు గాను 333 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంట్ అధికారి రామకృష్ణలు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ జుబేర్ అహ్మద్ తనిఖీ చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ బృందం శేఖర్, కృష్ణమాచారిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 84 మంది విద్యార్థులకు 77 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజేశ్వర్‌లు తెలిపారు.

మానవపాడు: మండల కేంద్రంలోని గంగు వెంకట కృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. 118 మంది విద్యార్థులకు 114 మంది హాజరయ్యారని డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గోవర్ధన్‌శెట్టి తెలిపారు. చీఫ్ ఎగ్జామినర్ పద్మావతి, సిబ్బంది పర్యవేక్షించారు.

అలంపూర్: ఇంటర్ వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా సాగాయి. అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు 478 మంది విద్యార్థులకు గాను 457 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్ మదన్‌మోహన్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ శివలింగం, సైదులు పరిశీలించారు.

అయిజ: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మండల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రంలో తొలిరోజు బుధవారం తెలుగు పేపర్ 1కు సంబంధించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 1029 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



పెంచికలపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

గట్టు: మండలంలోని పెంచికలపాడు, బోయలగూడెం గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 311 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 8 మందికి కంటి అద్దాలను అందించగా, 14 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నరేష్, హెల్త్‌సూపర్‌వైజర్లు మక్బూద్, స్వర్ణలత, ఏఎస్‌ఎం తాహేరా, ఈశ్వరమ్మ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. క్యాతూర్ పీహెచ్‌సీలోని భీమవరంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 71 మంది పురుషులు, 87 మంది మహిళలు మొత్తం 158 మంది పరీక్షలు చేయించుకున్నారు.

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు, ప్రాగటూరు గ్రామాల్లో కంటి పరీక్షలను నిర్వహించారు. ప్రాగటూరులో 121 మంది, ఇటిక్యాలపాడులో 145 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు రిజ్వానా తన్వీర్, యాకుబ్ బాషా, హేమమానస ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఐ, కానిస్టేబుల్‌పై హోంమంత్రికి ఫిర్యాదు



హోంమంత్రి మహమూద్ అలీని కలిసిన బాధితుడు జహంగీర్‌బాషా

శాంతినగర్: అలంపూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మహేందర్, శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎంకప్పపై హోంశాఖ మంత్రి మహమూద్ అలీకి శాంతినగర్‌కు చెందిన జహంగీర్ బాషా ఫిర్యాదు చేశాడు. బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హోంమంత్రిని కలిసి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్ తనను హత్యాయత్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రక్షణ కల్పించి చర్యలు తీసుకోవాలని హోం మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని బాధితుడు తెలిపాడు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ అందజేస్తున్న కలీముల్లా

శాంతినగర్: పదో తరగతి చదువుతున్న ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఏఐఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ వన్ మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. వడ్డేపల్లి, రాజోళి, అలంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది చదువుతున్న విద్యార్థులకు ఏఐఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కలీముల్లా సలార్-ఈ-మిల్లత్ ఆల్ ఇన్ వన్ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి టౌన్ అధ్యక్షుడు కవిత, నాయకులు శివ, యూసుఫ్, షబ్బీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



అయిజ: మండలంలోని ఈడిగోనిపల్లి శివారులో నర్సరీలో పెంచుతున్న మొక్కలను బుధవారం ఎంపీడీఓ సాయిప్రకాష్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలకు ప్రతిరోజు రెండు పూటలు నీళ్లు పోయాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీయాలని సూచించారు. అనంతరం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరిశీలించారు.

సకాలంలో పూర్తి చేయాలి



అయిజ: మున్సిపాలిటీలో చేపట్టిన డ్రెయినేజీ పనులను కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదేశించారు. బుధవారం మున్సిపాలిటీలోని 17వ వార్డులో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను మున్సిపల్ కమిషనర్‌తోపాటు మున్సిపల్ ఏఈ గోపాల్, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, కౌన్సిలర్ శశికళ పరిశీలించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 1.50 లక్షలతో డ్రెయినేజీ పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం అదే వార్డులో ఏర్పాటు చేసిన ఫ్రీడం పార్క్‌ను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



ఉండవెల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. బుధవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండలంలోని మారమునగాల–1,2 గ్రామ పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల రుణమాఫీ చేస్తామన్నారు. దివ్యాంగులను పలకరిస్తూ ముందుకు సాగారు. మారమునగాల గ్రామంలో లంబాడి మహిళలతో డ్యాన్స్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, నాగరాజు, రమేష్, మద్దిలేటి, నర్సన్ గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మల్దకల్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గద్వాల మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన జయరాములు మోటార్ సైకిల్‌పై అయిజకు వెళ్తున్నాడు. కుర్తిరావల్‌చెర్వు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి ద్విచక్రవాహనంపై మల్దకల్ వెళ్తుండగా మార్గమధ్యలో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో రెండు మోటార్ సైకిల్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జయరాములు, కృష్ణారెడ్డిలకు తీవ్ర గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గద్వాల ఆస్పత్రికి రిఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

మానవపాడు: అంతర్రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాము, షరణప్పలను పెబ్బేరుకు చెందిన రాముడు ద్విచక్రవాహంతో ఢీ కొన్నాడు. ఈ ఘటనలో రాము, షరణప్పకు గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రీడలతో బంగారు భవిష్యత్



అయిజ: క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందని బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు అన్నారు. బుధవారం మండలంలోని బైనిపల్లిలో గ్రామదేవత మారెమ్మ దేవర సందర్భంగా మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలి



అలంపూర్: ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలో ప్రశ్నాపత్రాల లీకేజీపై ప్రభుత్వ మౌనాన్ని నిరసిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ లీకైన ప్రశ్నాపత్రాల పరీక్షలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలన్నారు. లీకేజీ వ్యవహారంలో సహకరించిన అధికారులు, పాలకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణ, నాయకులు మహేష్, మణికుమార్, రాంబాబు, రాజు, సురేష్, రవీందర్, మహిళా నాయకులు నాగజ్యోతి తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వయంపాలన



ఈడిగొనిపల్లిలో ..



ముండ్లదిన్నెలో..

గద్వాల అర్బన్: మండలంలోని ఈడిగొనిపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతి గదులలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ సురేష్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు విష్ణు, జహురుద్దీన్, పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు తిరుపతన్న, నాగరాజు తదితరులు ఉన్నారు.

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నెలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జిల్లా కలెక్టర్లుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా, సంఘ సంస్కర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హన్మిరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ పెద్దింటి నాగేష్, ఉపాధ్యాయ సిబ్బంది, పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని గోకులపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మౌలాలి, విశ్వనాథ్, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

18న షాపింగ్ కాంప్లెక్స్‌లకు వేలం

గట్టు: మండల కేంద్రంలోని నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లకు శనివారం వేలం పాటను నిర్వహించనున్నట్లు ఎంపీఓ సయ్యద్‌ఖాన్ తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీలో షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఇటీవల నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏడు పెద్దవి, రెండు చిన్న దుకాణాలు ఉన్నాయన్నారు. పెద్ద దుకాణాలకు రూ.50 వేల డిపాజిట్(రీఫండబుల్), రూ.5 వేల కిరాయి, చిన్న షాపులకు రూ.40 వేల డిపాజిట్(రీఫండబుల్), రూ.4 వేల కిరాయిగా నిర్ణయించామన్నారు. 9 షాపుల్లో ఒకటి ఎస్సీలకు కేటాయించామని పేర్కొన్నారు. గట్టు గ్రామానికి చెందిన వారు మాత్రమే వేలం పాటలో పాల్గొనాలని కోరారు. గ్రామ పంచాయతీలో మధ్యాహ్నం 12 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందని వివరించారు. మూడు నెలలు కిరాయి చెల్లించని పక్షంలో షాపును వేలం వేసి, మరొకరికి కేటాయిస్తామని అధికారులు పేర్కొన్నారు. అంతకుముందు గ్రామంలో పంచాయతీ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయ ఆవరణలో బుధవారం గణపతి హోమాలను వేదపండితులు సత్యప్రమోదచార్యులు, శ్రీపతిలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని మండపంలో కలశపూజ, నవగ్రహహోమం, అష్టదిక్పాలక దేవతా హోమం, వాస్తు దేవతా హోమం, రుద్రహోమం, గరుడ వాహనం, సర్పహోమం, విష్ణుదేవుని హోమాలను నిర్వహించారు. శుక్రవారం బొడ్రాయి, శిఖర ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు అశోక్, వేదపండితులు శ్రావణ్‌కుమార్, పాండురంగాస్వామి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కుర్చీలను ఏర్పాటు చేస్తున్న చైర్మన్ రామన్‌గౌడ్

గద్వాల అర్బన్: గ్రంథాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్ అన్నారు. సరిపడ కుర్చీలు లేక ఇబ్బందులు పడుతున్నామని వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి బుధవారం రూ.20వేల ఖర్చుతో నూతనంగా 32 కుర్చీలను ఏర్పాటు చేశారు. కుర్చీలు సమకూర్చడంపై నిరుద్యోగ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గట్టు శ్రీనాథ్, గ్రంథాలయ అధికారి రామాంజనేయులు, భరత్ తదితరులు ఉన్నారు.

దుమ్ముతో ప్రయాణికులు సతమతం



గద్వాల-రాయచూరు రహదారిపై

ధరూరు: మండల కేంద్రంలోని గద్వాల–రాయచూరు ప్రధాన రహదారిపై వేసిన కంకర నుంచి నిత్యం దుమ్ములేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదుటి వ్యక్తి కనిపించనంతగా దుమ్ము ఎగిసి పడుతోందని పలువురు వాపోయారు. ఇరు వైపులా ఉన్న నివాస గృహాల వారు, వ్యాపార సముదాయాల వారు దుమ్ముతో కుస్తీ చేయాల్సిన దుస్థితి నెలకొంది. డస్ట్ అలర్జీతో పాటు వివిధ రోగాలబారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని చల్లించాలని గ్రామస్తులు వివరించారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పాదయాత్రకు తరలిరావాలి



మాట్లాడుతున్న అంజి

కేటీదొడ్డి: ఈ నెల 17 నుంచి గట్టు మండలంలోని బోయలగుడెం నుంచి ప్రారంభించనున్న ఆత్మగౌరవ పాదయాత్రకు కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకుడు అంజి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేసేందుకు చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 21 రోజులు 400 కిలోమీటర్ల పాటు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, దస్తగిరిగౌడు, ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు.